PRGI Reg No. TGTEL/25/A0555

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక 216 | పేజీలు : 8 | వెల రూ.5 | ఆదివారం 30.08.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్

Published From Rangareddy

Circulated by All Districts of Telangana and Andhra Pradesh







## పీఎం కిసాన్ కింద

# రూ. 2,000

## ఈ నెల 31 వరకే అవకాశం



ఢిల్లీ , ప్రభాత సూర్యుడు : ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 24వ విడత ఆర్థిక సాయం పొందేందుకు అర్హులైన రైతులకు కేంద్ర ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఈ విడత కింద అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,000 చొప్పున ఆర్థిక సాయం నేరుగా జమ కానుంది. అయితే ఈసారి 24వ విడత సాయం పొందాలంటే వ్యవసాయ రైతు గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలని అధికారులు తెలిపారు. రైతు గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియను 2026 ఆగస్టు 31లోపు పూర్తిచేయాలని గడువు విధించారు. అర్హులైన రైతులు గడువులోగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. రైతు గుర్తింపు సంఖ్య నమోదు కోసం ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా వివరాలు, అనుసంధానమైన మొబైల్ నంబరు అవసరమవుతాయి. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అర్హులైన రైతులకు నేరుగా అందించేందుకు రైతుల వివరాలను వ్యవస్థీకృతంగా నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పీఎం కిసాన్ పథకం కింద 24వ విడత సాయం పొందాలనుకునే రైతులు గడువులోగా రైతు గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలని సూచించారు. రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా ఆర్థిక సాయం జమ కానున్న నేపథ్యంలో బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ అనుసంధానం, మొబైల్ నంబరు వంటి వివరాలను సరిచూసుకోవాలని అధికారులు సూచించారు. గడువు ముగిసిన తర్వాత నమోదు ప్రక్రియ పూర్తి చేయడం వల్ల విడత సాయం పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున అర్హులైన రైతులు ఆగస్టు 31లోపు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.

## నేపాల్ వరదల్లో 700 దాటిన మృతుల సంఖ్య



2,426 మంది గల్లంతు.. వెల్లడించిన నేపాల్ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ

5,851 మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు

## అర్హులైన ఒక్క ఓటరు కూడా

# ఓటరు జాబితా నుంచి తప్పిపోకూడదు

## ఎన్నికల సంఘానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనలు

తెలంగాణలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి పలు కీలక సూచనలు చేశారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా ఓటర్ల జాబితా నుంచి తప్పిపోకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.



హైదరాబాద్ ప్రభాత సూర్యుడు : రాష్ట్రంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణలో 73.39 లక్షల మంది ఓటర్ల వివరాలను గైర్హాజరు, శాశ్వతంగా తరలివెళ్లిన, మృతిచెందిన, పునరావృతమైన విభాగాల్లో గుర్తించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. వీరిలో 45.19 లక్షల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లినవారిగా గుర్తించినట్లు పేర్కొన్నారు.

### అభ్యంతరాలకు మరింత సమయం ఇవ్వాలి

ఓటర్ల జాబితా సవరణలో ప్రజలకు తగిన అవకాశం కల్పించేందుకు అభ్యర్థనలు, అభ్యంతరాల స్వీకరణ గడువును మరో నాలుగు వారాలు పొడిగించాలని ముఖ్యమంత్రి ఎన్నికల సంఘాన్ని కోరారు. ఓటర్లకు తమ వివరాలను పరిశీలించుకునే అవకాశం ఉండటంతో పాటు, జాబితాలో తమ పేరు లేకపోతే దానిపై అభ్యంతరం తెలిపేందుకు తగిన సమయం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా ఓటర్లకు జారీ చేసే నోటీసులకు స్పందించేందుకు మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలని కోరారు. దీనివల్ల అర్హులైన ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తమ హక్కును కాపాడుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

### గ్రామ సభల్లో జాబితాలను బహిరంగంగా చదవాలి

ప్రత్యేక సవరణ అనంతరం రూపొందించే ముసాయిదా ఓటర్ల జాబితాలను గ్రామ సభలు, వార్డు కమిటీ సమావేశాల్లో బహిరంగంగా చదివించాలని ముఖ్యమంత్రి సూచించారు. స్థానిక ప్రజల సమక్షంలో జాబితాలను పరిశీలించడం ద్వారా తప్పులు, అభ్యంతరాలను త్వరగా గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కూడా కోరారు. ఓటర్లకు అవసరమైన సమాచారం అందించడంతో పాటు, దరఖాస్తులు, అభ్యంతరాల నమోదులో అధికారులు సహకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### అవసరమైన పత్రాలపై స్పష్టత ఇవ్వాలి

ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా సమర్పించాల్సిన ఆమోదయోగ్యమైన పత్రాల జాబితాను స్పష్టంగా ప్రకటించాలని ముఖ్యమంత్రి కోరారు. ఏయే పత్రాలను గుర్తింపు, నివాసం, ఇతర వివరాల నిర్ధారణకు పరిగణనలోకి తీసుకుంటారనే విషయంపై ప్రజలకు స్పష్టత ఉండాలని సూచించారు. అదేవిధంగా సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన స్థాయిలో ఓటర్ల నమోదు అధికారుల వ్యవస్థను బలోపేతం చేయాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

### ప్రభుత్వ సహకారం అందిస్తాం

అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా ఓటర్ల జాబితా నుంచి తప్పిపోకూడదు అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సక్రమంగా పూర్తి చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘానికి అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం, అర్హులైన ప్రతి ఓటరుకు అవకాశం కల్పించడం అత్యంత ముఖ్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం సీరియస్

### ఎమ్మెల్యే లేకుండానే ఇందిరమ్మ ఇళ్ల లక్కీ డ్రా ప్రారంభించడంపై మండిపాటు



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు: బంజారాహిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల లక్కీ డ్రా కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే హాజరు కాకుండానే లక్కీ డ్రా కార్యక్రమాన్ని ఎలా ప్రారంభిస్తారని అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించలేదంటూ అధికారులపై దానం నాగేందర్ మండిపడ్డారు. ప్రజాప్రతినిధికి సమాచారం ఇవ్వకుండా, ఆయన హాజరు కాకుండానే కార్యక్రమాన్ని ప్రారంభించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ నిబంధనలు పాటించడం అధికారులకు తెలియదా అంటూ ప్రశ్నించారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో అధికారులతో దానం నాగేందర్ వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. కార్యక్రమ నిర్వహణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన మధ్యలోనే అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బంజారాహిల్స్ కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో జరిగిన ఈ ఘటన ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## భద్రాచలం ఎమ్మెల్యే పీఏపై కేసు నమోదు

### ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో రూ.10 కోట్ల వరకు వసూళ్లు చేసినట్లు ఆరోపణలు





భద్రాచలం , ప్రభాత సూర్యుడు : భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ పీఏగా పనిచేస్తున్న కళ్యాణ్ కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నిరుద్యోగుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి, నకిలీ నియామక ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు, థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉద్యోగాలు, ఐటీసీ పేపర్ బోర్డులో ఉద్యోగాలు ఇప్పిస్తానని కళ్యాణ్ కుమార్ పలువురిని నమ్మించినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.30 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఇలా పలువురు నిరుద్యోగుల నుంచి దాదాపు రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు వసూలు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. డబ్బులు తీసుకున్న అనంతరం ఉద్యోగాలు వచ్చినట్లు నమ్మించేందుకు నకిలీ నియామక ఉత్తర్వులు అందించినట్లు ఫిర్యాదులో తెలిపారు. బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు కళ్యాణ్ కుమార్ గత మూడు రోజులుగా పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఉద్యోగాల కోసం డబ్బులు చెల్లించిన మరికొందరు బాధితులు కూడా పోలీసులను ఆశ్రయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా, ఎంత మొత్తంలో డబ్బులు వసూలు చేశారు, నకిలీ నియామక ఉత్తర్వులు ఎలా తయారు చేశారనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వంలో

# మార్పు కనిపించాలి



## ప్రజలకు చేయాల్సింది ఇంకా చాలా ఉంది

## మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అవసరం

### గుత్తా సుఖేందర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వంలో మార్పు కనిపించాల్సిన అవసరం ఉందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ప్రజలకు చేయాల్సింది ఇంకా చాలా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే ఉచిత పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు చేరేలా చూడాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడేళ్లు కావస్తున్న నేపథ్యంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అవసరమని గుత్తా సుఖేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. లంబాడా, యాదవ, మున్నూరుకాపు వర్గాలకు మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని సూచించారు. కొత్తవారికి అవకాశం కల్పించడం ద్వారా ప్రభుత్వంలో కొత్త ఉత్సాహం వస్తుందని, అసంతృప్తితో ఉన్న నాయకులకు కూడా ఒక స్పష్టమైన సంకేతం ఇచ్చినట్లవుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా ఉన్న వర్గ విభేదాలను తగ్గించాల్సిన అవసరం ఉందని గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీలో గ్రూపు తగాదాలను నియంత్రించి అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. చిన్నారెడ్డికి ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని ఆయన అన్నారు. అయితే పార్టీకి సంబంధించిన అంశాలపై చిన్నారెడ్డి బహిరంగంగా మాట్లాడటం సరికాదని,

2లో

# జూబ్లీహిల్స్ సీఐని బలి చేశారు

## ఉన్నతాధికారుల సంగతేంటి?

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



హైదరాబాద్,ప్రభాత సూర్యుడు: కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్ వ్యవహారంలో జూబ్లీహిల్స్ సీఐ ముత్తు యాదవ్‌ను బలి చేశారని బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఉన్నతాధికారులు చెప్పినందుకే సుమంత్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆయన పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. సుమంత్‌పై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించగానే సీఐ ముత్తు యాదవ్‌ను సస్పెండ్ చేశారని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే సీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదంటే, బాధ్యత కేవలం సీఐపైనే ఎలా ఉంటుందని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో ఏసీపీ వెంకట్ రెడ్డి, సంబంధిత డీసీపీల పాత్రపై కూడా ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఐని సస్పెండ్ చేసినప్పుడు, నిర్ణయ ప్రక్రియలో ఉన్నతాధికారుల పాత్రపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఏసీపీ వెంకట్ రెడ్డి, డీసీపీలను ఎందుకు సస్పెండ్ చేయలేదో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. సుమంత్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరపాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. పోలీసు శాఖలో తీసుకున్న నిర్ణయాలకు బాధ్యులైన ప్రతి అధికారిపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక ఘటనలో కింది స్థాయి అధికారిపై మాత్రమే చర్యలు తీసుకుని, ఉన్నతాధికారులను బాధ్యత నుంచి తప్పించడం సరికాదని ఆయన అన్నారు. ఈ వ్యవహారంలో వాస్తవాలను ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

### హైదరాబాద్‌లో రాత్రి సమయాల్లోనూ నడవనున్న ఆర్టీసీ బస్సులు

సెప్టెంబర్ 1 నుంచి రాత్రంతా నడవనున్న ఆర్టీసీ బస్సులు రాత్రి 10 గంటల నుంచి ఉ. 5 గంటల వరకు ఆర్టీసీ సర్వీసులు పైలట్ ప్రాజెక్టు కింద తొలుత ఆరు రూట్లలో ఆర్టీసీ సర్వీసులు సికింద్రాబాద్–కొండాపూర్, బాచుపల్లి–వేవ్‌రాక్, సికింద్రాబాద్–హయత్‌నగర్.. కోఠి–పటాన్‌చెరు, కోఠి–హైటెక్‌సిటీ, సికింద్రాబాద్–పటాన్‌చెరు రూట్లలో సర్వీసులు

# టీజీఐఐసీ, హెచ్ఎండీఏ, హౌసింగ్ బోర్డు ఆస్తులు సరిపోలేదని ఇప్పుడు పాలిటెక్నిక్ ఆస్తులు కావాలా?

మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులను ప్రైవేటు విధానంలోకి ఎందుకు తీసుకెళ్లాలని చూస్తున్నారని ప్రశ్నించారు. భవిష్యత్తులో ఫీజులు పెరగవని గ్యారంటీ ఏమిటని, ఫీజు రీయింబర్స్‌మెంట్ పరిస్థితి ఏమిటని నిలదీశారు. మూడేళ్ల తర్వాత కళాశాలలను వ్యాపార సంస్థల తరహాలో నిర్వహించుకోవాల్సి వస్తే విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. పాలిటెక్నిక్ విద్యార్థులు కేవలం బ్లూ కాలర్ ఉద్యోగాలకే పరిమితం కాదని, వైట్ కాలర్ ఉద్యోగాల్లోనూ రాణించే సామర్థ్యం వారికి ఉందని హరీశ్‌రావు అన్నారు. తాను ఇరిగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో డిప్లొమా చేసిన పలువురు ఏఈలుగా పనిచేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలోని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, వాటర్ వర్క్స్ ఇంజినీర్లలో గణనీయమైన సంఖ్యలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఉన్నారని తెలిపారు.

### "ఇది ఒక్క కాలేజీ పోరాటం కాదు.. లక్ష మంది విద్యార్థుల పోరాటం"

జీవో 97 రద్దు కోసం విద్యార్థులు గత 20 రోజులుగా ఆందోళన చేస్తున్నారని, వారి పోరాటానికి సెల్యూట్ చేస్తున్నానని హరీశ్‌రావు అన్నారు. ఇది ఒక్క మాసబ్‌ట్యాంక్ కళాశాలకు సంబంధించిన సమస్య కాదని, రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. ఢిల్లీలో జెన్–జీ తరహా ఉద్యమాలు ప్రభావం చూపిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. తెలంగాణలోనూ విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం అవసరమైతే రోడ్డెక్కుతారని అన్నారు. జెన్--జీ అంటే కేవలం రీల్స్, వీడియోలు చేసుకునే యువత కాదని, అవసరమైతే తమ భవిష్యత్తును కాపాడుకునేందుకు పోరాడే శక్తి కూడా ఉందని పేర్కొన్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గంగా ఉందని హరీశ్‌రావు విమర్శించారు. మహబూబాబాద్‌లో నిరసన చేస్తున్న ఓ విద్యార్థి గొంతును సీఐ పట్టుకున్న ఘటనను ప్రస్తావించారు. సూర్యాపేటలో ఓ విద్యార్థిని అరెస్ట్ చేయగా.. విద్యార్థినులు పోలీసులను చుట్టుముట్టి అతడిని విడిపించుకున్నారని తెలిపారు. పాలిటెక్నిక్ విద్యార్థులు ఏమైనా ఉగ్రవాదులా? అని ప్రశ్నించిన ఆయన.. శాంతియుతంగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్న విద్యార్థులను నిర్బంధించడం సరికాదన్నారు.

### సెప్టెంబర్ 7లోపు జీవో రద్దు చేయాలి

కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయవద్దని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. విద్యార్థుల ఉద్యమాన్ని నీరుగార్చేందుకే కమిటీలను ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు చేశారు. పాలిటెక్నిక్ విద్యను ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 7న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యేలోపు జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లక్ష మంది పాలిటెక్నిక్ విద్యార్థులకు అండగా బీఆర్ఎస్ పక్షాన తాను ముందుండి పోరాడతానని ప్రకటించారు. అవసరమైతే విద్యార్థులు, ఇతర వర్గాలను కలుపుకుని సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. మొత్తంగా, పాలిటెక్నిక్ విద్యను ప్రభుత్వ పరిధిలోనే కొనసాగించాలని, విద్యార్థుల ల్యాటరల్ ఎంట్రీ, ఫీజులు, రీయింబర్స్‌మెంట్, ఉపాధి అవకాశాలకు ఎలాంటి భంగం కలగకుండా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# ఆగస్టు 29 నుంచి హైదరాబాద్‌లో నైట్ బస్ సర్వీసెస్



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు: నగర ప్రయాణికులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గుడ్‌న్యూస్ తెలిపింది. ఆగస్టు 29 నుంచి హైదరాబాద్‌లో ఆరు ప్రధాన మార్గాల్లో రాత్రి వేళల్లో సిటీ బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకురానుంది. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఈ నైట్ బస్ సర్వీసులు నడవనున్నాయి. ఈ సేవలు ముఖ్యంగా ఐటీ ఉద్యోగులు, నైట్ షిఫ్ట్‌లలో పనిచేసే సిబ్బంది, ఇతర ఉద్యోగులు, ఆలస్యంగా ఇళ్లకు చేరుకునే ప్రయాణికులకు ఉపయోగపడనున్నాయి. రాత్రి వేళల్లో ప్రజా రవాణా సౌకర్యం అందుబాటులో ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు టిజిఎస్ఆర్టిసి వెల్లడించింది. ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌ను బట్టి ప్రతి 30 నిమిషాల నుంచి గంట వ్యవధిలో బస్సులను నడపనున్నట్లు సంస్థ తెలిపింది. నగరంలోని ప్రధాన ప్రాంతాలను కలుపుతూ నైట్ సర్వీసులను అందుబాటులోకి తీసుకురావడంతో రాత్రి ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగనుంది. ఆగస్టు 29 నుంచి ప్రారంభం కానున్న ఈ నైట్ బస్ సర్వీసులకు ప్రయాణికుల నుంచి వచ్చే స్పందనను బట్టి భవిష్యత్తులో మరిన్ని మార్గాలకు సేవలను విస్తరించే అవకాశం ఉంది.

# తప్పులతడకగా స్మార్ట్ రేషన్ కార్డులు



హైదరాబాద్ -- ప్రభాత సూర్యుడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆహార భద్రత కార్డులు (స్మార్ట్ రేషన్ కార్డులు) పంపిణీ కార్యక్రమంలో అధికారుల నిర్లక్ష్యం, సమన్వయ లోపం తీవ్ర గందరగోళానికి దారితీసింది. లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల్లో గ్రామాల పేర్లు, గ్రామపంచాయతీల పేర్లు, పోస్టల్ పిన్‌కోడ్‌లు తప్పుగా ముద్రించిన ఘటన వెలుగులోకి వచ్చింది. పలు మండలాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా మొదటి విడతగా శనివారం పలు గ్రామాల్లో లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు. అయితే పంపిణీ సమయంలో కార్డుల్లో ఉన్న తప్పులు బయటపడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. హరిపురం గ్రామంలో కార్డుల పంపిణీ సందర్భంగా అనేక తప్పిదాలు గుర్తించారు. హరిపురం గ్రామం పేరుకు బదులుగా ఓదెలగా ముద్రించారు. అలాగే రాయగూడెం గ్రామపంచాయతీ పేరుకు బదులుగా బుద్దారం అని, మోటాపురం గ్రామానికి బదులుగా రాజేశ్వరపురం గ్రామం పేరును కార్డుల్లో ముద్రించినట్లు గుర్తించారు. అంతేకాకుండా కొన్ని స్మార్ట్ రేషన్ కార్డుల్లో పోస్టల్ పిన్‌కోడ్ నంబర్లు కూడా తప్పుగా ముద్రించినట్లు అధికారులు గుర్తించారు. దీంతో లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది. కార్డుల్లో కీలక వివరాలు తప్పుగా ఉండటంతో పంపిణీ ప్రక్రియను అధికారులు నిలిపివేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఇలాంటి తప్పులు చోటుచేసుకోవడంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్డుల ముద్రణకు ముందు సంబంధిత వివరాలను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పలువురు పేర్కొన్నారు. తప్పులను సరిచేసి, సరైన వివరాలతో స్మార్ట్ రేషన్ కార్డులను త్వరగా అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

# ప్రభుత్వంలో మార్పు కనిపించాలి



ప్రజలకు చేయాల్సింది ఇంకా చాలా ఉంది
మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అవసరం

## గుత్తా సుఖేందర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

ఏవైనా అభిప్రాయాలు ఉంటే పార్టీ అంతర్గతంగా చర్చించి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో అనేక వర్గాలు ఉంటాయని, ఎవరు ఏ వర్గంతో ఉంటారో స్పష్టంగా చెప్పడం కష్టమని అన్నారు. కొండా సురేఖ వ్యవహారంలో పార్టీ పరంగా చర్యలు తీసుకోవడం మంచిదని గుత్తా సుఖేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. కొండా కుటుంబంపై చర్యలు తీసుకునే విషయంలో రెండు అవకాశాలు ఉన్నాయని, ఒకటి వేటు వేయడం కాగా, మరొకటి పునర్వ్యవస్థీకరణ ద్వారా సమస్యను పరిష్కరించడం అని పేర్కొన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన, ఎగువన ఉన్న కుటుంబాలకు సంబంధించిన అంశాలపై తాను పలు సూచనలు చేసినప్పటికీ ఇప్పటివరకు కార్యాచరణ జరగలేదని అన్నారు. ప్రభుత్వ వ్యవహారాల్లో సమాచార లీకేజీలను నియంత్రించాల్సిన అవసరం ఉందని సూచించారు. పాత పింఛన్లను పెంచాలని, తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# బురుగుపల్లి ప్రధాన రహదారిపై చెత్త వేస్తే రూ.10 వేల జరిమానా



## చెత్త వేస్తున్న వారిని పట్టించిన వారికి రూ.1,000 నగదు బహుమతి

ప్రభాత సూర్యుడు– సిద్దిపేట

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే లక్ష్యంతో బురుగుపల్లి గ్రామపంచాయతీ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామంలోని ప్రధాన రహదారిపై చెత్త వేయడం, వ్యర్థాలను పడేయడాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రకటించారు. ప్రధాన రహదారిపై చెత్త వేస్తూ పట్టుబడిన వారికి రూ.10,000 జరిమానా విధించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా చెత్త వేస్తున్న వ్యక్తులను ఫొటో లేదా వీడియో ఆధారాలతో గ్రామపంచాయతీ దృష్టికి తీసుకువచ్చి పట్టించడంలో సహకరించే వారికి రూ.1,000 నగదు బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు. గ్రామంలో పారిశుధ్యాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని గ్రామపంచాయతీ కోరింది. చెత్తను గ్రామపంచాయతీ ఏర్పాటు చేసిన చెత్త సేకరణ విధానంలోనే అందజేయాలని సూచించింది. బురుగుపల్లి గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమని గ్రామపంచాయతీ ప్రతినిధులు తెలిపారు.

# కేంద్రమంత్రి పదవి నుంచి నితిన్ గడ్కరీ ఔట్?



న్యూఢిల్లీ , ప్రభాత సూర్యుడు

కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై ఊహాగానాలు కొనసాగుతున్న వేళ.. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. కొత్త తరానికి బాధ్యతలు అప్పగించాల్సిన సమయం వచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు.

### కొత్త తరానికి బాధ్యతలు

తాను మునుపటిలా ఎక్కువ సమయం పని చేయలేకపోతున్నానని గడ్కరీ పేర్కొన్నారు. ఇకపై సామాజిక సంక్షేమం, రైతుల శ్రేయస్సుపై ఎక్కువగా దృష్టి సారించాలనే ఆలోచనలో ఉన్నట్లు వెల్లడించారు.

### గడ్కరీ వ్యాఖ్యలతో ఊహాగానాలు

కేంద్ర కేబినెట్‌లో మార్పులు జరుగుతాయన్న వార్తల నేపథ్యంలో గడ్కరీ వ్యాఖ్యలు ప్రాధాన్యతసంతరించుకున్నాయి. ఆయన నిజంగానే కేంద్ర మంత్రి పదవి నుంచి తప్పుకోబోతున్నారా? లేక తన రాజకీయ భవిష్యత్తుపై సాధారణ వ్యాఖ్యలు చేశారా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. అయితే, గడ్కరీ కేంద్ర మంత్రి పదవి నుంచి తప్పుకుంటున్నట్లు అధికారిక ప్రకటన వెలువడలేదు. కాబట్టి ప్రస్తుతం ఇది రాజకీయ వర్గాల్లో జరుగుతున్న ఊహాగానాలుగానే చూడాలి.

# ఉచితంగా ఆధార్ కార్డు అప్‌డేట్


## సెప్టెంబర్ 30 వరకు ఛాన్స్



న్యూఢిల్లీ , ప్రభాత సూర్యుడు

చిన్న వయసులో ఆధార్ తీసుకున్న పిల్లల బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసేందుకు ఖ×ణూ× ఉచిత అవకాశం కల్పిస్తోంది. 5 నుంచి 15 ఏళ్ల మధ్య వయసున్న పిల్లల ఆధార్‌లో వేలిముద్రలు, ఐరిస్ వంటి బయోమెట్రిక్ వివరాలను తప్పనిసరిగా అప్‌డేట్ చేయించాలి. ఈ సేవను సెప్టెంబర్ 30 వరకు ఉచితంగా పొందే అవకాశం ఉంది. ఐదేళ్లలోపు పిల్లలకు జారీ చేసే బాల ఆధార్‌లో సాధారణంగా బయోమెట్రిక్ వివరాలను నమోదు చేయరు. దీంతో పిల్లలకు ఐదేళ్లు పూర్తైన తర్వాత వేలిముద్రలు, ఐరిస్ వంటి వివరాలను ఆధార్‌లో అప్‌డేట్ చేయడం కీలకంగా మారుతుంది. అలాగే 15 ఏళ్లు పూర్తైన తర్వాత మరోసారి బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. పిల్లల వయసుకు అనుగుణంగా బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేయడం ద్వారా ఆధార్‌లోని సమాచారం తాజా వివరాలతో కొనసాగుతుంది. సెప్టెంబర్ 30 తర్వాత ఇదే సేవకు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి అర్హత ఉన్న పిల్లల తల్లిదండ్రులు గడువు ముగిసేలోపు ఆధార్ బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# సెక్రటేరియట్‌లో బయటపడ్డ సీఎం సెక్యూరిటీ డొల్లతనం





హైదరాబాద్ -- ప్రభాత సూర్యుడు: తెలంగాణ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి భద్రత విషయంలో సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యం బయటపడింది. ముఖ్యమంత్రి మీడియా సమావేశానికి వెళ్లే సమయంలో సెక్యూరిటీ సిబ్బంది ఆయనను నిర్ణయించిన ప్రదేశానికి కాకుండా మరో అంతస్తుకు తీసుకెళ్లడం కలకలం రేపింది. నిన్న సచివాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో 29వ గదిలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరయ్యేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఇతర నేతలతో కలిసి లిఫ్ట్‌లో బయలుదేరారు. అయితే లిఫ్ట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆగాల్సి ఉండగా ఫస్ట్ ఫ్లోర్‌లో ఆగింది. లిఫ్ట్ నుంచి బయటకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా 32వ గదికి వెళ్లారు. అనంతరం మీడియా సమావేశం గ్రౌండ్ ఫ్లోర్‌లోని మీడియా హాల్‌లో ఏర్పాటు చేసినట్లు గుర్తించిన అధికారులు విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రేవంత్‌రెడ్డి మళ్లీ మెట్ల మార్గంలో గ్రౌండ్ ఫ్లోర్‌కు చేరుకుని మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి భద్రత విషయంలో సెక్యూరిటీ సిబ్బంది నుంచి ఇలాంటి పొరపాటు జరగడంపై ఈఎస్‌డబ్ల్యూ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. సచివాలయ సీఎస్‌ఓపై కూడా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రాకపోకలు, భద్రతా ఏర్పాట్ల విషయంలో సమన్వయం లోపించడంపై అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.



# సంపాదకీయం

## ట్రంపరితనంను ఎదురించాల్సిందే !

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హద్దుమీరి ప్రవర్తిస్తున్న తీరు మరోమారు ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఏ దేశం ఎవరితో దోస్తానా చేయాలో..ఎవరితో వాణిజ్యం చేయాలో అన్న ఆంక్షలు విధించే హక్కు ట్రంప్‌కు ఎక్కడిదని ప్రశ్నించాలి. ఈ విషయంలో మోడీ దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టాలి. ట్రంప్ ఆంక్షలను అంగీకరించేది లేదని గట్టిగానే చెప్పాలి. చర్చలు జరిపేది లేదంటున్న ట్రంప్‌తో మనం కూడా అంతే మొండి వైఖరితో ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో చెప్పగలగాలి. ఒకవైపు మనపై వాణిజ్య ఆంక్షలు విధిస్తూ..మరోవైపు పాక్‌ను దువ్వుతున్న తీరు అమెరికా ద్వంద్వ నీతిని తెలియ చేస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా విధించిన అదనపు సుంకాలు తీవ్ర దుమారం రేపుతున్న వేళ ట్రంప్ ఏ మాత్రం తగ్గేది లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో రెండు దేశాల మధ్య ఓ రకంగా విభేదాలు పొడసూపి నట్లుగానే భావించాలి. ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలు భారత్‌కు పరీక్షగా మారాయి. ఈక్రమంలో మోడీ కూడా మనదేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటూనే ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలను తమపై విధించడంతో భారత్ దీటుగా స్పందించింది. తమ దేశంలోని రైతులు, మత్స్యకారులు, పాల ఉత్పత్తుల రంగంలోని వారి ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసింది. అవసరమైతే ఆ భారాన్ని తామే భరిస్తామని వెల్లడించింది. మరోవైపు భారత్‌పై మరిన్ని ఆంక్షలను విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇక ఆయన విధించిన సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. దీనివల్ల అమెరికాలో కొన్నింటి ధరలు పెరగనున్నాయి. అయితే, అమెరికా అదనపు సుంకాల వల్ల రెండు దేశాల మధ్య తలెత్తిన వివాదం తాత్కాలికమేనని, త్వరలోనే సమసిపోతుందని ప్రవాస భారతీయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. చర్చలు ఫలించి త్వరలో ఒప్పందం కుదరనుందనే ఆశాభావం వ్యక్తం చేశాయి. 50 లక్షల మంది ప్రవాస భారతీయులు అమెరికా అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నారని పేర్కొన్నారు. భారతీయ ఉత్పత్తులపై 50శాతం సుంకాలను వేయడాన్ని ఇండియన్‌-అమెరికన్ల నేత, బైడెన్ మాజీ సలహాదారు అజయ్ భుటోరియా ఖండించారు. 'అమెరికాలో తక్కువ ధరలకు లభించే 50శాతం జనరిక్ మందులను భారత్ సరఫరా చేస్తోంది. ఈ సుంకాలు వాటి ధరలను పెంచుతాయి. దీనివల్ల అమెరికాలోని కుటుంబాలు, సీనియర్ సిటిజన్లు, చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడతారు. మసాలా దినుసులు, పప్పులు, దీపావళి దుస్తుల ధరలు పెరుగుతాయని పేర్కొన్నారు. దుస్తులు, పాదరక్షల ధరలు 37శాతం దాకా పెరగవచ్చని అభిప్రాయపడ్డారు. ఇది ఎలా ఉన్నా మనం కూడా తగ్గేదేలా లేదన్నట్లుగా వ్యవహ రించాలి. కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ ఇదే విషయాన్ని గుర్తుచేశారు.. ట్రంప్ విధించిన అదనపు సుంకాలపై ప్రధాని మోదీ గట్టిగా సమాధానమిచ్చారు. తమ రైతుల ప్రయోజనాల విషయంలో ఎప్పటికీ రాజీ పడబోమని, దానికి ఎంత మూల్యమైనా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలే మాకు అత్యంత ముఖ్యం. రైతులు, మత్స్యకారులు, డెయిరీ ఉత్పత్తిదారుల ప్రయోజనాల విషయంలో భారత్ ఎప్పటికీ రాజీ పడబోదు. వారిని కాపాడటం కోసం సుంకాల భారాన్ని సొంతగా భరించడానికీ సిద్ధం అని ప్రధాని స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు కొంటుందన్న కారణంతో భారత్‌పై 50శాతం సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో బాంబు పేల్చారు. తదుపరి మరిన్ని ఆంక్షలను చూస్తారంటూ హెచ్చరించారు. శ్వేత సౌధంలోని ఓవల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'భారత్‌పై మేం 50శాతం సుంకాలను విధించిన విషయం మీకు తెలుసు. ఆ దేశం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో రెండో స్థానంలో ఉంది. తొలిస్థానంలో ఉన్న చైనాకు అతి దగ్గరగా ఉంది. అందుకే భవిష్యత్తులో మరిన్ని ఆంక్షలను చూడబోతున్నారని పేర్కొన్నారు. ట్రంప్ తీరు చూస్తుంటే పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది. తన వైఖరిని నెగ్గించుకోవడమే ఆయనకు ముఖ్యంగా ఉంది. ఎలన్ మస్క్ లాంటి వారినే దూరం పెట్టిన ట్రంప్‌కు భారత్ ప్రయోజనాలు ముఖ్యం కాదు. ఇకపోతే ఆపరేషన్ సింధూర్ తరవాత భారత్ సైనికంగా బలపడడంతో కూడా ట్రంప్ తట్టుకోవడం లేదని తెలుస్తోంది. ఇది కూడా ట్రంప్ వైఖరికి కారణం కావచ్చని వశ్లేషిస్తున్నారు. భారత్‌పై గతంలో విధించిన 25శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. అదనంగా విధించిన మరో 25శాతం ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. మన దేశంతోపాటు అనేక దేశాలపై సుంకాలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయి. దీనివల్ల బిలియన్ల కొద్దీ డాలర్లు అమెరికాకు వస్తాయని ట్రంప్ ప్రకటించారు. ఈ సుంకాలు 10శాతం నుంచి 50శాతం దాకా ఉన్నాయి. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత గత పదకొండేళ్లుగా ఇలా ఎప్పుడూ జరగలేదు. అవినీతిరహితంగా పాలన సాగుతుందన్న పేరు వచ్చింది. అలాగే సాహసోపేత నిర్ణయాలు కూడా తీసుకుని సత్తా చాటింది. అయోధ్య, కాశ్మీర్, ట్రిపుల్ తలాక్ విషాయల్లో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్ ద్వారా మన సైనిక సత్తా చాటాం. పాక్‌కు గట్టిగా బుద్ది చెప్పాం. ప్రపంచవ్యాప్తంగా భారత్చర్యలకు గట్టి మద్దతు లభించింది. మోడీ సర్కార్ సాహస నిర్ణయాలకు వెనకాడదని రుజువు చేసుకుంది. సర్జికల్ స్ట్రయిక్స్ తరవాత, ఆపరేషన్ సిందూర్తరవాత కూడా పాక్ వైఖరిలో మార్పు రాలేదు. దాయాది దేశాన్ని ప్రపంచంలో దోషిగా నిలబెట్టిన ఘనత మోడీదే అని చెప్పక తప్పదు. ట్రంప్ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారో అని దేశం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఈ క్రమంలో భారత్ తన సార్వభౌమాధికరం ముఖ్యమని చాటి చెప్పాలి.

## మా భూములకు రక్ష కెటిఆర్ అన్న



మొదటి పేజీ తరువాయి

అధికారులు, పోలీసులు దౌర్జన్యం చేశారని, ఆమె భర్తను జైలుకు పంపిన, సమయంలో కేటీ-ఆర్ ఢిల్లీ వెళ్లి పలు కమిషన్లకు ఫిర్యాదులు చేసి, జ్యోతితో పాటు- లగచర్ల గిరిజనులకు, పేద రైతన్నలకు జరుగుతున్న అన్యాయాన్ని ఢిల్లీ వేదికగా ఎండగట్టారు. దీని ఫలితంగా, ప్రభుత్వం భూసేకరణను వెనక్కి తీసుకుందని వారు తెలిపారు. కేసుల కారణంగా జైలుపాలైన లగచర్ల సోదర సోదరీమణులందరికీ కేటీఆర్ అన్నగా అండగా నిలబడి, న్యాయ సహాయం అందించారని, అందరినీ జైలు నుంచి విడిపించారని వారు తెలియజేశారు.

# ప్రైవేట్ డ్రైవర్లనూ వదలని సర్కార్

## బీమా ఎగ్గొట్టారని మండిపడ్డ కెటిఆర్



హైదరాబాద్-ప్రభాత సూర్యుడు

కేవలం 20 నెలల్లోనే అన్ని వర్గాలను వంచించిన దగాకోరు రేవంత్ సర్కార్.. ప్రైవేట్ రంగంలోని డ్రైవర్లను సైతం నట్టేట ముంచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు అసంఘటితరంగ కార్మికులకు, గిగ్ వర్కర్లకు అరచేతిలో వైకుంఠం చూపించిన రేవంత్.. గద్దెనెక్కాక ఉన్న పథకాన్ని కూడా ఊడగొట్టాడు! అని ధ్వజమెత్తారు.మహోదాత్త హృదయంతో, మానవీయ కోణంతో కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన డ్రైవర్లకు రూ. 5 లక్షల ప్రమాద బీమా పథకానికి ఇన్సూరెన్స్ ప్రీమియం ఎగ్గొట్టి, కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ పెట్టింది.. నిరుపేద డ్రైవర్ల కుటు-ంబాలకు క్షోభను మిగిల్చింది అని కేటీ-ఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. 2024 అక్టోబర్ నుండి పథకాన్ని ఆపేసి.. ప్రమాదవశాత్తు మరణించిన డ్రైవర్ల కుటు-ంబాలను రేవంత్ రోడ్డున పడేశాడు అని కేటీ-ఆర్ పేర్కొన్నారు. రైతు బీమా, నేతన్నకు బీమా, డ్రైవర్లకు బీమా వంటి ఎన్నో పథకాలతో సబ్బండ వర్ణాల ప్రజల భవిష్యత్తుకు కేసీఆర్ ధీమా అందిస్తే.. ఒక్కో పథకానికి మంగళం పాడి పేద కుటు-ంబాల భవిష్యత్తును అగమ్యగోచరంగా మారుస్తోంది ఈ కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వం. రూ. 5 లక్షల ప్రమాద బీమా పథకాన్ని తిరిగి ప్రారంభించాలని, పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే సెటిల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.. లేకుంటే డ్రైవర్ల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి, ఈ అమానవీయ సర్కార్ మెడలు వంచుతామని కేటీఆర్ హెచ్చరించారు.

# అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తికి ఊరట

## నిషేధిత ఉత్తర్వులను వెనక్కి తీసుకున్న సుప్రీం

న్యూఢిల్లీ-ప్రభాత సూర్యుడు

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తికిఊరట దక్కింది. గంతలో విధించిన నిషేధ ఉత్తర్వులను సుప్రీం వెనక్కు తీసుకుంది. హైకోర్టు జడ్జిపై ఆంక్షల విషయంలో గతంలో వెలువరించిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు ఉపసంహరించుకుంది. అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఓ న్యాయమూర్తి రిటైరయ్యేంతవరకూ ఆయనకు క్రిమినల్ కేసులు అప్పగించకూడదని ఆంక్షలు విధిస్తూ ఈనెల 4న వెలువరించిన ఉత్తర్వులను ఉప సంహరించుకుంటున్నట్లు పేర్కొంది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ అభ్యర్థన మేరకు న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం దీనిని వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు విషయంలో తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నుంచి తమకు లేఖ అందిందని ధర్మాసనం పేర్కొంది. సంబంధిత న్యాయమూర్తికి ఇబ్బందులు కలిగించడం తమ ఉద్దేశం కాదని.. అయితే కొన్ని విషయాల్లో పరిమితులు దాటినప్పుడు న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడటమే కోర్టు పనిచేస్తుందని జస్టిస్ పార్దివాలా పేర్కొన్నారు. అంతకు ముందు ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నప్పటికీ అలహాబాద్ హైకోర్టు తీర్పు చట్టవిరుద్ధమని ఆందోళన వ్యక్తంచేశారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ఇటువంటి ఆదేశాలను విస్మరించలేమని స్పష్టం చేశారు. ఒక సివిల్ వివాదంలో క్రిమినల్ చర్యలకు అనుమతినిస్తూ అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఓ న్యాయమూర్తి ఇటీవల జారీచేసిన ఆదేశాలకు సంబంధించిన కేసులో రి-టైరయ్యేంత వరకూ ఆయనకు ఎలాంటి క్రిమినల్ కేసులు అప్పగించవద్దని ఈనెల 4న సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశంలోని కొన్ని అంశాలు అమలుకాకుండా నిరోధించేందుకు ఫుల్ కోర్టును సమావేశపరచాలని అలహాబాద్ హైకోర్టుకు చెందిన 13 మంది న్యాయమూర్తులు గురువారం అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఒక లేఖ రాశారు. హైకోర్టులపై పాలనాపరమైన పర్యవేక్షణ అధికారం సుప్రీంకోర్టుకు లేదని, అందుకే ఆగస్టు 4నాటి సుప్రీం ఆదేశాల్లో 24వ, 26వ పేరాల్లోని నిర్దేశాలను అమలుచేయరాదని ఫుల్‌కోర్టు తీర్మానించాలని జడ్జీలు కోరారు. ఈ నేపథ్యంలో 'సుప్రీం' తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.

# అలీబాబా 40 దొంగలు

- కెసిఆర్ కుటుంబానికి ఇది సరిపోతుంది
- అప్పులు చేసి దోచుకోవడంలో అందవేసిన చేయి
- కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి




హైదరాబాద్-ప్రభాత సూర్యుడు

తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అడ్డంగా దోచుకున్నారని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. ఎంత దొరికితే అంత దోచుకున్నారని విమర్శించారు. అప్పులుల తెచ్చి అప్పుల్లోనూ కమిషన్లు దండుకున్న ఫ్యామిలీ వారిదని మండిపడ్డారు. శుక్రవారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఇంకా చెప్పాలంటే అంచనా వేయలేనంతగా రాష్ట్రాన్ని దోచి పడేశారని తెలిపారు. అవినీతి ఎలా చేయాలో అనే యూనివర్సిటీకి కేసీఆర్ ప్రొఫెసర్ అని అభివర్ణించారు. రాష్ట్ర ప్రజల ఖజానా దోచుకోవడంలో కేసీఆర్ ఫ్యామిలీ దిట్ట అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకొని.. సుద్దపూసలాగా.. నంగనాచి మాటలు మాట్లాడుతున్నారని కేసీఆర్ ఫ్యామిలీపై నిప్పులు చెరిగారు. అలీబాబా నలభై దొంగలు అనే -టైటిల్ కేసీఆర్ ఫ్యామిలీకి కరెక్ట్ సెట్ అవుతుందని స్పష్టం చేశారు. వారు స్థాపించిన పార్టీలోని కొత్త ప్రభాకర్ సుద్దపూసలాగా మాట్లాడుతున్నాడని చెప్పారు. ప్రజలకి ఏమైనా చేద్దామంటే ఖజానాలో మిగుల్చకుండా దోచుకొని పోయారంటూ కేసీఆర్ ఫ్యామిలీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే బీఆర్ఎస్ నేత, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై జగ్గారెడ్డి మరోసారి నిప్పులు చెరిగారు. నువ్వు నా క్యారెక్టర్ అంచనా వేయలేవంటూ కొత్త ప్రభాకర్ రెడ్డికి సూచించారు. రాష్ట్రంలో ఎవర్ని అడిగినా నా క్యారెక్టర్ గురించి చెబుతారన్నారు. నా క్యారెక్టర్‌కి, ప్రభాకర్ రెడ్డి క్యారెక్టర్‌కి చాలా తేడా ఉంటు-ందని పేర్కొన్నారు. ప్రభాకర్ రెడ్డికి ఉన్నంత ఆస్తి నా వద్ద ఉంటే ప్రజలకి ఎప్పుడో పంచేసే వాడినని తెలిపారు. పంచే గుణం మా అమ్మనాన్న నాకు ఇచ్చిన ఆస్తి అని చెప్పారు. భవిష్యత్తులో నేను రూ. వేల కోట్లు- సంపాదించినా వాటిని ప్రజలకే పంచుతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. నా ఆస్తి నా పిల్లల కోసం కాదని.. ప్రజల కోసమని తెలిపారు. రూ. 1000 కోట్లు- కొన్ని గంటల్లోనే పంచేస్తానన్నారు. ప్రభాకర్ రెడ్డికి ఎలా పంచాలో కూడా తెలియదని ఆక్షేపించారు. నేను ఎలాంటి వాడినో కేసీఆర్, హరీష్ రావుని అడిగి తెలుసుకోవాలంటూ ప్రభాకర్ రెడ్డికి సూచించారు. కొత్త ప్రభాకర్ రెడ్డి.. నీవు మగాడవయితే నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్ రెడ్డిది నా స్థాయి కాదన్నారు. కొన్ని విషయాల్లో ఎమోషనల్ కావ్వడం నా బలహీనత అని తెలిపారు. ప్రజల సమస్య వింటే వాళ్ళ కంటే ముందు నాకే ఏడుపు వస్తుందన్నారు. నా చుట్టూ పేదలు ఉంటారని.. నా వద్దకు క్యాన్సర్ పేషెంట్లు- సైతం వస్తారని చెప్పారు. నేనేమైనా ప్యాకేజీల లీడర్ నా అంటూ బీఆర్ఎస్ నేతలను ఈ సందర్భంగా జగ్గారెడ్డి సూటిగా ప్రశ్నించారు. నేనేమి బీ ఫారంలు కొనుకొని రాలేదని వ్యంగ్యంగా అన్నారు. దొంగతనాలు మీరు చేసి.. మాపై నిందలు వేస్తారా? అంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మీలాగా ప్రైవేట్ కంపెనీనా? అని వారిని నిలదీశారు. ఇసుక దందాలలో మీరు సంపాదించింది ఎంత? అంటూ ఆ పార్టీ నేతలను ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని భూములు, చెరువులు కబ్జా చేసింది బీఆర్ఎస్ నాయకులేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# ఫసల్ బీమా యోజనతో రైతులకు అండ

## ప్రభుత్వ నిర్ణయంతో రైతుల్లో ఆనందం




హైదరాబాద్-ప్రభాత సూర్యుడు

కేంద్రం తీసుకుని వచ్చిన ఫసల్ బీమాలో చేరాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రైతులకు మేలు జరుతుందని కూడా తెలిపింది. రైతులను ఆదుకునే క్రమంలో పసల్ బీమా యోజనలో చేరడం, రైతల కిస్తీకూడా ప్రభుత్వమే భరిస్తుందిన సిఎం, డిప్యూటి సిఎంలు కూడా వెల్లడించారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతాంగానికి వెన్నుదన్నగా నిలుస్తుంది..ప్రకృతి కరుణించక అనుకోని వైపరీత్యాలతో పంట నష్టపోతూ... ఇక వ్యవసాయం వద్దు అనుకునే రైతన్నకు ప్రధానమంత్రి ఫసల్ భీమ యోజన అండగా నిలుస్తోంది. దేశానికి వెన్నుముక రైతు , రైతు పంటలు పండిస్తేనే ప్రజలకు ఐదు వేళ్ళు నోట్లోకి వేలుతాయి. అలాంటి రైతు తాము పండించిన పంటకు అకాల వర్షాలతోనో అనుకోని వైపరీత్యాలతో పంట నష్టపోతే అ రైతు పరిస్తితి ఏంటి అనుకునే తరుణంలో ఫసల్ బీమాయోజన వారికి ఆసరాగా నిలిచింది. పంట నష్టపోయిన రైతన్నను అమ్మలా అదుకుంటూతుంది. వ్యవసాయం దండుగ అని గతంలో అన్న రైతుకు వ్యవసాయం పండుగా అనేలా ప్రతి రైతు ప్రకృతి వైపరీత్యాలకు బెదరకుండా తమ భూమిని సాగు చేసి వ్యవసాయాన్ని చేసే దైర్యాన్ని ఇస్తుంది.. ఫసల్ బీమా యోజన పథకం. రైతు తాము పండించే పంట పెట్టుబడి ఎకరాకు అందులో రెండు శాతం ఫసల్ బీమా పథకం ప్రీమియం కడితే చాలు వరిపంటకు ఎకరాకు 34 వేల బీమా ఉండగా అందులో రెండు శాతం అంటే 680 రూపాయలు ప్రీమియం కడితే చాలు అలగే మొక్క జొన్న ... వేరుశనిగే పంటలకు రెండు శాతం ఉండగా పసుపు పంటకు మాత్రం 3.5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంది.. దీంతో రైతుకు ఎదురయ్యే ఇబ్బందులు తెగుళ్ళు .. వడగళ్ళు.. పిడుగులు.. అకాల వర్షాలతో పంట నష్టపోతే ఆ రైతుకు ఫసల్ బీమా రక్షణగా నిలుస్తుంది.. వీటితో పాటు ఇందులోనే వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ద్వారా పత్తి పంటతో పాటు మిర్చిపంటకు కూడా రైతు 5 శాతం ప్రీమియం చెల్లిస్తే వాతావరణం అనుకులించ కున్న వేసిన విత్తనం మొలకేత్తకపోయిన రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంట పెట్టుబడి నష్ట పోకుండా ఫసల్ బీమా పథకం అండగా నిలుస్తుంది. పంటకోత తర్వాత జరిగే నష్టాలకూ బీమా వర్తిస్తుంది. పంటనష్టం జరిగిందని తెలియగానే బీమా మొత్తంలో 25 శాతం మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు. అంతేకాదు క్లెయిమ్ సెటిల్ కోసం పంట నష్టాన్ని అంచనా వేయటానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడతారు. స్మార్ట్ ఫోన్ల ద్వారా పంట కోత సమాచారాన్ని ఫొటోలు తీసి, అప్‌లోడ్ చేస్తారు. గతంలో ఎన్నో పంట బీమా పథకాలు ఉన్న కూడా తాము అకాల వర్షాలతో నష్టపోయే వాళ్ళమని... ఇప్పుడు ఫసల్ బీమాపై వ్యవసాయ అధికారులతో పాటు బ్యాంకు అధికారులు అవగాహన కల్పించడంతో తాము వ్యవసాయం అంటే కష్టం కాదని వ్యవసాయాన్ని ఇష్టంతో చేసుతున్నామని రైతులు తెలుపుతున్నారు.

# టాలీవుడ్‌లో అన్నాచెల్లెళ్ల అనుబంధం

## రాఖీ పండుగ వేళ ప్రత్యేక సందడి



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు. సోదరీమణులు తమ సోదరుల చేతికి రాఖీ కట్టి వారి సుఖసంతోషాలను కోరుకుంటారు. సోదరులు సైతం తమ అక్కాచెల్లెళ్లకు అండగా ఉంటామని మాట ఇస్తారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి ఈ పండుగను ఆనందంగా జరుపుకోవడం ఆనవాయితీ. టాలీవుడ్‌లోనూ రాఖీ పండుగ సందడి కనిపిస్తోంది. తెలుగు చిత్ర పరిశ్రమలో ఎన్నో సినీ కుటుంబాలు ఉన్నాయి. ఆయా కుటుంబాల్లో అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కొందరు ఒకే కుటుంబం నుంచి సినిమాల్లోకి వచ్చి నటులుగా, దర్శకులుగా, ఇతర విభాగాల్లో రాణిస్తుండగా.. మరికొందరు చిత్ర పరిశ్రమకు దూరంగా ఉంటూ తమ వృత్తుల్లో కొనసాగుతున్నారు.

### సినీ కుటుంబాల్లో ప్రత్యేక అనుబంధం


టాలీవుడ్‌లో అన్నాచెల్లెళ్ల బంధానికి సంబంధించిన ఎన్నో ఆసక్తికరమైన ఉదాహరణలు ఉన్నాయి. ఒకే కుటుంబానికి చెందిన నటీనటులు తెరపై కలిసి కనిపించిన సందర్భాలు కూడా ఉన్నాయి. కుటుంబ వేడుకలు, పండుగల సమయంలో వీరంతా ఒక్కచోట చేరి సందడి చేస్తుంటారు. దీంతో అభిమానులు కూడా తమ అభిమాన తారల కుటుంబ బంధాలను ఆసక్తిగా గమనిస్తుంటారు.

### రాఖీ వేళ అభిమానుల సందడి

రాఖీ పండుగ సందర్భంగా సినీ తారలు తమ అన్నాచెల్లెళ్లతో కలిసి దిగిన ఫొటోలు, పండుగ శుభాకాంక్షలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడం సాధారణంగా మారింది. తమ బాల్య జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రత్యేక అనుబంధాన్ని అభిమానులతో పంచుకుంటున్నారు. దీంతో టాలీవుడ్‌లోనూ రాఖీ పండుగ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సినీ ప్రపంచంలో బిజీగా ఉన్నప్పటికీ కుటుంబానికి, ముఖ్యంగా అన్నాచెల్లెళ్ల బంధానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్న పలువురు తారలు రాఖీ పండుగను ఆత్మీయంగా జరుపుకుంటున్నారు. ప్రేమ, నమ్మకం, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగ సినీ కుటుంబాల్లోనూ ప్రత్యేకతను చాటుతోంది. రాఖీ పండుగ సందర్భంగా టాలీవుడ్‌లోని ప్రముఖ అన్నాచెల్లెళ్ల జంటలను అభిమానులు మరోసారి గుర్తుచేసుకుంటున్నారు. తెరపై తమ ప్రతిభతో ఆకట్టుకున్న ఈ కుటుంబాల వెనుక ఉన్న ఆత్మీయ బంధాలు కూడా అభిమానులకు ప్రత్యేక ఆసక్తిని కలిగిస్తున్నాయి.




# 100 కోట్ల క్లబ్‌లో రవితేజ 'ఇరుముడి'




హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

మాస్ మహారాజా రవితేజ కెరీర్‌లో మరో భారీ విజయం నమోదైంది. శివ నిర్వాణ దర్శకత్వంలో, జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందించిన 'ఇరుముడి' చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తూ రూ.100 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. తండ్రి, కూతురు అనుబంధాన్ని ప్రధానంగా తీసుకుని తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా భావోద్వేగ సన్నివేశాలు, రవితేజ నటన, కథా నేపథ్యం సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయని అభిమానులు చెబుతున్నారు. విడుదలైన కొద్దిరోజుల్లోనే వసూళ్లలో సరికొత్త రికార్డులు సృష్టించిన 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచినట్లు చిత్ర బృందం పేర్కొంది. రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరడంతో అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. శివ నిర్వాణ దర్శకత్వ శైలి, జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం సినిమాకు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. తండ్రి--కూతురు బంధాన్ని వెండితెరపై ఎమోషనల్‌గా ఆవిష్కరించడం ప్రేక్షకులను ఆకట్టుకున్నట్లు తెలుస్తోంది. 'ఇరుముడి' విజయం రవితేజ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచింది.

# పూనకాలు లోడింగ్




Printed by RATNA GRAPHICS, At H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad-500 013 Telangana.
Published by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS, Printed at HYDERABAD and Pulblished at H.No: 7-83/2, HANUMAN NAGAR, KUNTLOOR, ABDULLAPUR MET MANDAL,Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City,Telangana.
Editor : CHERUKU UPENDAR, E-mail: prabhathasuryudueditor@gmail.com PRGI Reg No : TGTEL/25/A0555